# మనసు రాజధానికి...

## డా. శిరీష-స్పందన

విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బయలుదేరడానికి సిద్ధంగా ఉంది గోదావరి ఎక్స్‌ప్రెస్! వీక్లీ చదువుకుంటున్న సందీప్, ఎదుటి సీటులో ఎవరో వచ్చి కూర్చోవడంతో యధాలాపంగా అటుచూసి, షాక్ అయ్యాడు. తన డిగ్రీ క్లాస్‌మేట్ సుప్రజ! సుప్రజ సందీప్‌ను చూడగానే పచ్చివెలక్కాయ గొంతులో పడినట్లు ఇబ్బందిపడి, తలదించుకుంది.

ఆఫీసు పనిమీద హైదరాబాద్ వెళ్తున్నాడు సందీప్. సుప్రజను చూసిన కాస్సేపటిలోనే ఆమె దర్పం, డాబు ఏమాత్రం తగ్గలేదని అనిపించింది అతనికి.

రైలు హైదరాబాద్‌కు ప్రయాణం మొదలుపెట్టేసరికి- సందీప్ ఆలోచనలు గతంలోకి పరుగుతీసాయి.

★★★

''కంగ్రాట్స్ సందీప్!'' అతని చేతిని తనే అందుకుని షేక్ హ్యాండ్ ఇస్తూ చెప్పింది సుప్రజ. డిగ్రీ విద్యార్థుల ఫేర్‌వెల్ ఫంక్షన్‌లో డిబేటింగ్‌లో ఫస్ట్ ప్రయిజ్ వచ్చింది సందీప్‌కి. అందుకే సుప్రజ గ్రీట్ చేసింది.

అప్పటినుంచి వాళ్ళ పరిచయం దినదిన ప్రవర్ధమానం అయ్యింది. సుప్రజ మాటతీరు, అందం సందీప్‌ను ఆకట్టుకున్నాయి. అతనిలో కొత్త ఆశలు మొలకెత్తాయి. కానీ వాటిని ఆమె ఎదురుగా చెప్పలేదు.

సుప్రజ కోటీశ్వరుడి కూతురు. ఇటువంటివాళ్ళు అహంకారం ముందు పుట్టి తర్వాత పుడతారంటారు. అదే సందీప్ సంకోచం. సుప్రజకు తనతో ఉన్నది చనువా? ప్రేమా? అనే విషయం సందీప్‌కి అంతుచిక్కేదికాదు.

ఒకరోజు అనుకోకుండా పార్క్‌లో కనిపించింది సుప్రజ. తన భావాలు తెలియజెప్పేందుకు ఇదే మంచి సమయం అనిపించింది సందీప్‌కి. విరబూస్తున్న ఎర్రగులాబీని కోసి, సుప్రజకు ఇచ్చాడు. ఆమె ఏదో అనబోయేంతలో- ''లలితమైన ఈ గులాబి నా మనసు మీదేనని ఎంత అందంగా చెబుతోందో- అర్థం చేసుకోండి'' అన్నాడు.

సుప్రజ అతనివైపు తేరిపార చూసింది. అంతకు ముందరిరోజే ఫ్రెండ్స్ మాటల్లో ఆర్థికపరంగా సందీప్ చాలా తక్కువ అంతస్థులో ఉన్నాడని తెల్సింది. ప్రపంచంలో డబ్బు ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు ఇద్దరే ఉంటారని, డబ్బున్నవాళ్ళు ఆడించినట్లు డబ్బులేనివాళ్ళు ఆడతారనీ, అదే ప్రపంచ రీతి అనీ ఆమె నమ్మకం.

సందీప్ ఇచ్చిన గులాబీని చేతితో అటూ ఇటూ తిప్పుతూ వయ్యారంగా బయటికి నడిచిన సుప్రజను మౌనంగా అనుసరించాడు సందీప్.

పల్లీలు అమ్ముకుంటున్న పిల్లను పిలిచి, గులాబీ ఇచ్చి, రెండు రూపాయల పల్లీలు కొనుక్కుని సందీప్ వైపు తిరిగి ''చూడండి సందీప్, మంచి వ్యక్తిగా ఇటువంటి ఆలోచనలు మానుకోండి. అంతస్థులు తెల్సుకుని మసలడం మంచిది'' అనేసి, కారు ఎక్కి వెళ్ళిపోయింది సుప్రజ.

ఆమె డబ్బుకే ప్రాముఖ్యత ఇస్తూ మనసు గురించి పట్టించుకోవటం లేదనే బాధతో ఇంటిముఖం పట్టాడు సందీప్.

ఆ తర్వాత సుప్రజకు దగ్గరవ్వాలని సందీప్ చేసిన ప్రతీ పనీ ఆమెలో అహంకారాన్ని మరింత రెచ్చగొట్టింది. అతని అంతస్థు తెల్సుకోకుండా చనువుగా మసలినందుకు ఈ ఇబ్బంది వచ్చి పడిందనీ, ఎల్లాగైనా సందీప్ బారినుండి తప్పించుకోవాలనీ ఆలోచనలో పడింది సుప్రజ.

ఒకరోజు ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉన్న క్లాస్ రూంకి ఒక్కొక్క మెట్టూ ఎక్కి వస్తున్న సందీప్ సుప్రజ కంటపడ్డాడు.

''పెద్ద పెద్ద ఆశలు ఉంటే సరిపోదు. దానికి తగ్గ అంతస్థూ ఉండాలి. పైకి వెళ్ళేందుకు ఎప్పుడూ మీకన్నా మేమే మిన్న'' అతనికే వినబడేలా అనేసి, గబగబా పైకి వెళ్ళబోయిన సుప్రజ, వెనక్కి తిరిగి సందీప్‌తో మాట్లాడి, ముందుకి మెట్లెక్కడంతో హైహీల్స్ స్లిప్ అయి వెనక్కి పడబోయింది.

సందీప్ వెంటనే రియాక్ట్ అయ్యాడు. రెండుమెట్లు పైకెక్కి ఆమెను పట్టుకున్నాడు. సుప్రజ చేతిలోని పుస్తకాలు ఎగిరి చెల్లాచెదురుగా పడ్డాయి. అతని చేతుల్లో ఆమె-మేఘాల పరుపులపై నడుంవాల్చిన జాబిలమ్మలా ఉంది. ఏదో తెలియని ఆత్మీయత అతని స్పర్శలో అనుభవంలోకి వచ్చిందామెకు.

సందీప్‌ను ఇంకా అవమాన పరచాలనుకుంటూ ఇలా అభాసుపాలవడం ఆమె ఉక్రోషాన్ని తారాస్థాయికి చేర్చింది. ఒక్క ఉదుటన సందీప్ చేతుల్లోంచి లేచి బ్యాలెన్స్ చేసుకుని, తన కుడి చేతిని వేగంగా కదిల్చింది. సందీప్ ఎడమ చెంప ఛెళ్ళుమంది.

★★★

ఆరోజు ఫస్టవర్ ఖాళీ అవ్వడంతో, సుప్రజ ఇంకా కాలేజికి రాకపోవడంతో, ఆమెకోసం గ్రౌండ్‌లో ఎదురుచూస్తూ కూర్చున్నాడు సందీప్. కాస్సేపటి ఎదురుచూపులను అంతం చేస్తూ ఆకాశ నీలం రంగు పంజాబీడ్రెస్‌లో వచ్చింది సుప్రజ. ఆమెకన్నా ముందు నెమ్మదిగా క్లాస్ వైపు నడిచాడు సందీప్. సుప్రజ వేగంగా నడుస్తుందని అతనికి తెల్సు. ఆమె తనను దాటివెళ్ళినపుడు ఆ చున్నీ రెపరెపలకి వీచిన గాలి హేమంతపు పున్నమిరేయి చల్లదనాన్ని అందిస్తుందని ఆశించిన సందీప్‌కి, గ్రీష్మ ఋతువులోని వడదెబ్బ తగిలింది.

క్రిందపడిన పుస్తకాలు తీసుకుని, ''నన్ను టచ్ చేసేందుకు ఎంతధైర్యం నీకు? మైండ్ యువర్ లిమిట్స్'' అనేసి, క్లాస్ రూం వైపు వెళ్ళిపోయింది సుప్రజ.

అందరికీ క్లాస్‌లు జరుగుతుండడంతో జరిగిన సంఘటన కాబట్టి ఎవరికీ తెలియలేదు. అనుకోకుండా బయటకి వచ్చిన లత మాత్రం ఈ సంఘటనను చూసింది.

రెండురోజుల తర్వాత మధ్యాహ్నం క్యాంటీన్‌లో టిఫిన్ చేస్తుండగా-

''మన నిర్మల గుర్తుందా సుప్రజా?'' అడిగింది లత. లత, సుప్రజ, సందీప్ ఒకే క్లాస్‌వాళ్ళు. సందీప్ తనను ప్రేమిస్తున్నట్లు చెప్పిన విషయం లతకు చెప్పింది సుప్రజ. వాళ్ళిద్దరి మధ్య ఆ క్లోజ్‌నెస్ ఉంది.

''గుర్తుంది. నవ్వుతూ తుళ్ళుతూ ఉండేది- పాపం! భగవంతుడు ఆమెను చిన్నచూపు చూసాడు'' నిట్టూర్చింది సుప్రజ.

''అవును. నీకోసం సందీప్‌ను పంపినట్లు ఆమెకోసం ఎవర్నీ పంపలేదు''

లత మాటల్లోని భావం గ్రహించింది సుప్రజ.

''నాన్సెన్స్. డబ్బున్నవాళ్ళని కాపాడుకోవడం డబ్బులేనివాళ్ళ కర్తవ్యం'' కళ్ళెగరేస్తూ అంది.

''నో! అది అతని మంచితనం. నీ నిర్లక్ష్యానికి తగిన శాస్తి జరుగుతుందనుకుంటే, నిర్మల ప్రాణాల్లా నీ ప్రాణాలూ అనంత వాయువుల్లో కలిసిపోయేవి. అతని ప్రేమను అంగీకరించకపోయినా ఫరవాలేదు. జరిగిన పొరపాటుకు సారీ చెప్పు'' అన్న లత మాటలకి-

''సరే! రేపు చూద్దాం'' అంది సుప్రజ.

ఆ 'రేపు' ఇప్పటివరకు రానేలేదు.

★★★

సుప్రజకు ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉంది. రైలు వేగంగా వెళ్తుంటే ఎంతో ఎంజాయ్ చేసే మనస్తత్వం ఆమెది. ఇవాళ క్షణమొక యుగంలా గడుస్తోంది.

''బహుశా సందీప్‌కి పెళ్ళియిపోయి ఉంటుంది. భార్యను పురిటికి పుట్టింట్లో దింపివస్తున్నాడేమో! లేదంటే కొడుకో, కూతురో పుడితే చూసేందుకు వెళ్తున్నాడేమో?'' ఒకదానివెంట ఒకటి ఆలోచనలు ప్రశ్నలు కురిపిస్తున్నాయి ఆమె మనసులో. సమాధానం కావాలంటే అతనితో మాట్లాడాలి. అవమానపరచిన విషయం మరచిపోతాడా? క్షమించమనడానికి కూడా వీలు లేనంతకాలం గడచిపోయింది. ఇప్పుడు ఉపయోగం ఏముంది?

''అప్పుడే సందీప్ మనసును అర్థం చేసుకుని ఉంటే ఈరోజున పరిస్థితి ఇలా ఉండేదా?'' ఈ ఆలోచన రాగానే ఆమె కన్నుల్లో అప్రయత్నంగా కన్నీటిపొర ఏర్పడింది. ఆ పొర వెనకాల కైలాష్ రూపం కదలాడింది.

ఒక ఫంక్షన్‌లో సుప్రజను చూసి, పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు కైలాష్. అతని అంతస్థు తమకన్నా ఎక్కువని సుప్రజకు తెల్సి, వెంటనే ఒప్పుకుంది. నెల తిరక్కుండా వాళ్ళ పెళ్ళియిపోయింది.

కైలాష్ సాన్నిహిత్యంలో జీవితంలో వేటికి విలువ ఇవ్వాలో, వేటికి ఇవ్వకూడదో కొంతవరకు తెల్సొచ్చింది సుప్రజకు. ఒకరోజు భోజనం చేసి, ఫోమ్ పరుపు మంచం మీద వెల్లకిలా పడుకుని ఆలోచించడం మొదలుపెట్టింది ఆమె. గదిలో ఉన్న ఏసి మిషన్ తన పని తాను చేసుకుపోతోంది. ఆ చల్లదనం సుప్రజ మనసును చల్లబరచ లేకపోతోంది.

గతం ఎంత బాగుండేది? అనుకున్నదే తడవుగా జరిగిపోయేది ఏ విషయమైనా. ఇప్పుడంతా తలక్రిందులయ్యింది. ఆరోజు ఉదయం జరిగిన విషయం గుర్తొచ్చింది ఆమెకు.


కైలాష్ టీ తాగుతూ తన దగ్గరకి నడచివచ్చి, రిస్ట్‌వాచీలో టైము చూసుకుంటున్నట్లు చేస్తూ, తనపై 'టీ' ఒంపేసాడు. ఒక క్షణం అదొకరకమైన నవ్వు అతని పెదాలపై ప్రత్యక్షమై మాయమయ్యింది.

''అయ్యయ్యో!'' అన్నాడు. అతని ఆంతర్యం అర్థమయ్యింది సుప్రజకి. భార్య అంటే భర్తకి చాకిరీ చేస్తూ, తిట్లుతింటూ, తను ఆడించినట్లు ఆడాలని అతని ఉద్దేశ్యం. అతని లెక్కలేనితనమే భరించలేకపోతోంది సుప్రజ.

అంతకుముందు ఓసారి నడుస్తున్న ఆమెకు కాలు అడ్డుపెట్టి, పడిన తర్వాత లేపి, ''చూసి నడవచ్చుకదా'' అన్నాడు.

అతడు చేసే పనుల్లో కొన్ని చెప్పుకోగలిగేవి. మరికొన్ని చెప్పుకోలేనివి! సుప్రజ అందం, చదువు, గర్వం, డబ్బు ఇవేమీ అతన్ని మార్చుకోవడంలో ఆమెకు సహకరించలేదు. నిత్యం అతనివల్ల నరకం అనుభవించేకన్నా అతన్ని వదలి వెళ్ళిపోవడమే మంచిదనే నిర్ణయానికి వచ్చేసింది సుప్రజ.

వెంటనే



తల్లిదండ్రులకి ఫోన్ చేసి, విశాఖ వస్తున్నట్లు చెప్పింది. ఈ అనుకోని ప్రయాణం దేనికని అడిగిన తండ్రికి సమాధానం చెప్పకుండా ఫోను పెట్టేసింది.

ఆ తర్వాత హైదరాబాద్ వెళ్ళడం, కైలాష్‌ను చూడడం మళ్ళీ ఇప్పుడే! హైదరాబాద్ ఎంతో బాగుంటుందని కైలాష్‌తో అక్కడ కాపురం పెట్టించిన సుప్రజకు, ఇప్పుడు ఆ ఊరు అన్నా, అతను అన్నా అసహ్యం.

విడాకుల కోసం కోర్టులో కేసు వేసినా, తప్పని పరిస్థితుల్లో ఒకే ఒక్కసారి కోర్టుముందు హాజరై వచ్చేసింది. అప్పుడు కైలాష్ కోర్టుకి రాలేదు.

రేపు హైదరాబాద్‌లో విడాకుల పేపర్లు తీసుకోవాలి. కైలాష్‌కి తన రాక గురించి తెల్సు. తప్పకుండా తనూ కోర్టుకి వస్తాడు. ఓ విషపు నవ్వు నవ్వి వెళ్ళిపోతాడు. ఆ ఒక్క నవ్వునీ ఎలాగో ఒకలా

భరించేయగల్గితే, ఇక జీవితంలో అతని ముఖం చూడక్కరలేదు.

రైలు ఇంజన్ కూత గట్టిగా వినిపించడంతో ఆలోచనలలోంచి బయటపడింది సుప్రజ. అప్పటికి బాగా చీకటి పడింది. రైలు వేగంగా కుడివైపునకు మలుపు తిరుగుతోంది. మరో ఐదు నిముషాల్లో రాజమండ్రి స్టేషన్‌లో ఆగింది.

దాహంగా అనిపించడంతో ప్లాట్‌ఫారం మీదకి దిగి, కూల్‌డ్రింక్ తాగింది సుప్రజ. ప్లాట్‌ఫారంమీద ఎంతోమంది ఉన్నారు. ఆమె దగ్గరకి వచ్చి ''ఎలా ఉన్నావు?'' అని అడిగే మనిషే కరువు.

ఎన్నికోట్లుపోసి కొనాలన్నా దొరకని వస్తువులు, తీరని అవసరాలు ఉంటాయని అప్పుడప్పుడే ఆమెకు తెలుస్తోంది.

రాజమండ్రి స్టేషన్‌ను వదలిన రైలు, పాములా రెండు మెలికలు తిరిగి, రోడ్ కమ్ రైలు బ్రిడ్జిమీదకి వచ్చింది. సుప్రజ బోగీ తలుపు దగ్గర నించుంది. దూరంగా మూడవ బ్రిడ్జి ఆర్చిలు, పాతవంతెన అస్పష్టంగా కనిపిస్తున్నాయి. గోదావరి ప్రశాంతంగా ప్రవహిస్తోంది. చల్లగాలి ఆమె ముంగురులను సవరిస్తోంది. మనసు మాత్రం వేటికీ ప్రతిస్పందించటం లేదు.

అదే టైముకి సందీప్ బోగి రెండవ వైపు తలుపు దగ్గర నించొని గోదావరి వైపు చూస్తున్నాడు. రైలు రిథమిక్‌గా ఊగుతోంది. అతనికి 'స్వప్న' గుర్తొచ్చింది. ఆమెకు రైలు అలా రిథమిక్‌గా ఊగుతూ వెళ్తొంటే చాలా ఇష్టం.

సుప్రజ దూరమయ్యాక గట్టిగా మూసేసుకున్న మనసు తలుపులను స్వప్న తట్టి మరీ తెరిపించింది. సుప్రజ దూరమవ్వడంతో పెళ్ళే చేసుకోకూడదనుకున్న సందీప్, బలవంతంగా ఓసారి పెళ్ళిచూపులకి వెళ్ళాడు.

'అమ్మాయితో ఏకాంతంగా మాట్లాడాలి' అని చెప్పి అందర్నీ బయటకి పంపి, ఎదురుగా నునుసిగ్గులు ఒలకబోస్తూ కూర్చున్న స్వప్నతో తన గతం చెప్పి, ''సుప్రజ లేని జీవితమే తనకు ఇష్టమనీ, మరెవరికీ మనసులోకానీ, జీవితంలోకానీ తావీయలేన''ని చెప్పాడు.

''ఒకరి ప్రేమను పొందలేకపోయినంత మాత్రాన జీవితం మోడయిపోతుందా? ప్రేమ జీవితంలోని ఒక భాగమేకానీ; జీవితం మొత్తం ప్రేమకోసం కాకూడదు. మిమ్మల్ని నేను పెళ్ళి చేసుకుంటాను. వసంతాన్ని మళ్ళీ రుచి చూపిస్తాను.''

ధీమాగా చెప్తున్న స్వప్నకేసి ముందు ఆశ్చర్యంగా చూసి, తర్వాత ఆనందంగా పెళ్ళికి ఒప్పుకున్నాడు సందీప్. పెళ్ళి సెటిల్ కాగానే అంతకుముందు అతను అటెండ్ అయిన స్టేట్‌బ్యాంకు ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయినట్లు ఉత్తరం వచ్చింది. ఒక ఏడాది తెలంగాణాలో పనిచేసాక, విశాఖకు ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని వచ్చేసాడు సందీప్.

ఆడవాళ్ళు మగవాళ్ళని ప్రేమిస్తే జీవితం ఎలా ఉంటుందో స్వప్న సాన్నిహిత్యంలో తెల్సింది అతనికి. ఆమె రూపంతో పాటు మనసుని కూడా వెతికి పట్టుకుందామన్నా ఒక్క వంకరా దొరికేది కాదు ఎవ్వరికీ. 'ప్రేమించడం కన్నా ప్రేమింపబడటం మిన్న' అని ఎందుకన్నారో అప్పుడు అర్థమయ్యింది సందీప్‌కి.

స్వప్న ఉత్సాహంతో పోటీపడితే, సెలయేరు తప్పకుండా ఓడిపోతుంది. ఆమె నవ్వుల వెన్నెల వానల్లో రోజూ తడిసి ముద్దవుతూ, అంతటి అదృష్టాన్ని తనకు కలిగించిన ఆమెకి ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పుకున్నాడో అతనికే గుర్తులేదు.

ఒకరోజు భర్త ఆఫీసు నుంచి ఇంటికి రాగానే గట్టిగా వాటేసుకుంది స్వప్న.

''ఏయ్! ఏమిటా కంగారు? కాళ్ళయినా కడుక్కోనివ్వవా?'' ఆమె నడుము చుట్టూ చేతులు వేస్తూ కొంటెగా అడిగాడు సందీప్.

''ఇంక మీ కొంటెతనం, కుర్రతనం తగ్గించుకోవాలి మాష్టారూ'' సిగ్గుపడుతూ చెప్పింది స్వప్న.

ఆమె ముఖంలో తొంగి చూసిన సిగ్గును అతను గమనించలేదు.

''ఏం? నా జుట్టులో తెల్లవెంట్రుకలు కనిపిస్తున్నాయా? వెంటనే హెయిర్ డై కొనుక్కుంటానులే'' అన్నాడు.

''లేదుసార్. మీరు పెద్దవారవుతున్నారు. ఐమీన్- ప్రమోషన్ వస్తోంది'' చెప్పిందామె.

''ప్రమోషనా? ఆఫీసుకి రాకుండా ఇంటికి వచ్చిందా లెటర్?'' అడిగాడు సందీప్.

''ప్రమోషన్ ఇస్తున్నది ఆఫీసువాళ్ళు కాదు. నేను త్వరలో తండ్రిగా మిమ్మల్ని ప్రమోట్ చేస్తున్నాను.''

స్వప్న మాటలు పూర్తి అవుతుండగానే ఆమెను అమాంతం గాల్లోకి లేపి, ఒక రౌండ్ తిప్పి క్రిందకు దింపాడు సందీప్. ఆమె నుదుటున ముద్దు పెట్టుకుంటూ ''థాంక్యూ వెరీమచ్'' అన్నాడు.

''థాంక్స్‌తోనే సరిపోదండీ. అదేదో సినిమాలోలా పాట పాడాలి.''

''అలాగే రాణీగారూ''

ఆమె రాధికలా నవ్వింది.

రాత్రి పడుకునే వరకూ ఇద్దరూ ఎన్నో ఊహలల్లుకున్నారు. సందీప్‌కి ఆరోజు ఒక క్రొత్త స్వప్న కనిపించింది. ఆ మాటల్లోనే నిద్రలోకి జారుకున్న ఇద్దరూ, ఒక రాత్రివేళ అయిన శబ్దానికి ఉలిక్కిపడి లేచాడు.

''ఏదో చప్పుడయ్యింది కదూ?'' సందీప్ అడిగాడు.

''నాకూ అలాగే అన్పించింది'' సందీప్‌తోపాటు మంచం దిగుతూ అంది స్వప్న.

సందీప్ లైటు వేసాడు. ఇల్లంతా నిశ్శబ్దం అలుముకుంది. వాచీ సెకన్లు మింగేస్తూ చేస్తున్న శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది.

ఒక్కక్షణం గడిచాక అడుగుల చప్పుడు బెడ్‌రూం వైపే ఎవరో వస్తున్నట్లు తెలియజేసింది. సందీప్ చురుగ్గా ఆలోచించాడు. బెడ్‌రూం ప్రక్కన ఉన్న స్టోర్ రూంలో బూజుల కర్ర ఉంది. ప్రస్తుతానికి అదే ఆయుధం. గబగబా అటువైపు వెళ్ళాడు. ఇంతలో ఓ ఆకారం బెడ్‌రూం తలుపు ఎదురుగా ప్రత్యక్షం అయ్యింది. ఎవరో దొంగతనానికి వచ్చినట్లు అర్థమయ్యింది స్వప్నకు.

వేగంగా కదిలి, తలుపు మూసెయ్యబోయింది. అది గమనించిన దొంగ, తన బలమంతా ఉపయోగించి, తలుపును వెనక్కి తోసాడు. ఇది ఊహించని స్వప్న



## రమ్యకు నో ఛాన్స్

సాజన్ చలే ససురాల్, కూలీ నెంబర్ వన్, హీరో నంబర్ వన్, దీవానా, మస్తానా లాంటి సూపర్ డూపర్ హిట్స్ అందించిన డేవిడ్‌ధావన్, గోవిందాల కాంబినేషన్‌లో వచ్చిన 'బనారసిబాబు' ఊహించినంత విజయం సాధించలేదు. ఈ సినిమా ముంబాయిలో మొదటివారం 73 శాతం మాత్రమే కలెక్ట్ చేసింది. కలెక్షన్స్ క్రమక్రమంగా తగ్గిపోయాయి. గోవిందా, డేవిడ్ ధావన్‌ల కాంబినేషన్‌లో వచ్చిన మొట్టమొదటి పెద్ద ఫ్లాప్ చిత్రంగా దీన్ని వర్ణిస్తున్నారు. బనారసిబాబు పరాజయం గురించి ఒప్పుకుంటూ 'మూడేళ్ళ క్రితం ఈ సబ్జక్టు అనుకున్నప్పుడు, అందులో కొత్తదనం కనిపించింది. ఈ లాంగ్‌గ్యాప్‌లో ఈ సబ్జెక్ట్ అవుట్‌డేటెడ్‌లా అనిపించింది. అంతకన్నా ముఖ్యంగా జనం ఈ చిత్రంలో 'కరిష్మా'ను మిస్‌కావడంతో నిరాశపడ్డారు. కేవలం గోవిందా-కరిష్మాల జంట మాత్రమే స్క్రీన్ మీద మేజిక్ చేయగలరని నాకర్థమయింది' చెప్పాడు. అంటే రమ్యకృష్ణకు ఇక డేవిడ్ ధావన్ చెయ్యి ఇచ్చేసినట్టు చెప్పకనే చెప్పినట్టు కదూ?!

-జె.వి.బాబు

బ్యాలెన్స్ తప్పి తలుపుతో సహా వెనక్కి గోడకి గుద్దుకుంది.

''అమ్మా!'' బాధగా ఆమె నోటి లోంచి వచ్చిన కేకకు అదిరిపడి, దొంగ బయటకి పరిగెత్తాడు. సందీప్ కఱ్ఱ అందుకోకుండానే తిరిగి వచ్చాడు. తలుపుకి, గోడకి మధ్య స్వప్న పడి ఉంది. తల గోడకు గుద్దుకున్న చోట రక్తం అంటుకుని ఉంది.

''స్వప్నా'' అంటూ ఆదుర్దాగా ఆమెను లేవదీసాడు సందీప్. గట్టిగా ఆమెను కుదిపాడు. ఆమెలో చలనం లేదు. అతని మెదడు మొద్దుబారిపోతోంది. అనుమానం వచ్చి ముక్కు దగ్గర వేలు పెట్టి చూసాడు.

స్వప్న-స్వప్నమై కరిగిపోయింది. మరో మనిషికి నూరేళ్ళ జన్మను ఈయవలసిన మనిషికి నూరేళ్ళూ అర్ధాంతరంగా నిండిపోయాయి. ఏడ్చేందుకు అతనికి కంటిలోంచి నీళ్ళు రావటం లేదు.

★★★

''కాస్త పక్కకి తప్పుకోండి'' అన్నమాటలతో ప్రస్తుతంలోకి వచ్చాడు సందీప్. రైలు ఏదో స్టేషన్‌లో ఆగి ఉంది. ప్లాట్‌ఫారం మీదకి దిగాడతను. కళ్ళ నుంచి కన్నీటి చుక్కలు రాలి ప్లాట్‌ఫారం మీద ఇంకిపోయాయి.

ఎదురుగా ఉన్న కుళాయి దగ్గరకు వెళ్ళి, ముఖం కడుక్కుని జేబురుమాలుతో తుడుచుకుంటూ చూసాడు-ఏలూరు స్టేషను అది!

నించునే ఓపికలేక రైలెక్కి తన సీటులో కూర్చున్నాడు సందీప్. చావు ఎంత దయలేనిది? దొంగ రూపంలో వచ్చి-స్వప్నని పట్టుకుపోయింది. ఇల్లంతా దోచుకున్నా బాధ ఉండేదికాదు! పూచికపుల్ల కూడా పోలేదు. స్వప్నను మాత్రమే పోగొట్టుకోవడం ఎంత దౌర్భాగ్యం?


స్వప్నకన్నా ముందు తన మనిషి అనుకున్న సుప్రజ ఇప్పుడు ఎదురుగానే ఉంది. కానీ మనసు విప్పి బాధ చెప్పుకోనంత దూరం ఇద్దరిమధ్యా పరుచుకుంది. ఇంకా ఆమె గురించి ఆలోచించడం అనవసరం.

సందీప్ ఆలోచనలు ఒక దిశ లేకుండా కొనసాగుతున్నాయి.

ఆమెలో అతను క్షమించలేని గుణం తనను ప్రేమించకపోవడం కాదు; ఆమె అహంకారం!

సుప్రజ ఏదో ఆలోచిస్తూ కిటికీలోంచి బయటకు చూస్తోంది. ఆమెను పరిశీలనగా చూసాడు. అతని చూపులు ఆమె కాళ్ళ దగ్గర ఆగాయి. ఆమె కాళ్ళకి మెట్టెలు ఉన్నాయి.

''పెళ్ళయి భర్తతో సుఖంగా ఉంటున్న ఆమెకు నా



ఆలోచన అవసరం ఏముంటుంది?''

కానీ ఆమె అందం అలాగే ఉన్నా ముఖంలో అప్పటి ఉత్సాహం మాత్రం లేదు.

''ఎందుకలా ఉందో?''

ఆమె అహంకారం వల్ల ఒకసారి దెబ్బతిన్న అతను, మరోసారి ఆ పరిస్థితి తెచ్చుకోదలుచుకోలేదు.

మనఃశ్శాంతి కోసం కళ్ళుమూసుకున్నాడు సందీప్.

సందీప్ కళ్ళు మూసుకోవడం గమనించిన సుప్రజ, కాస్త ఈజీగా కదిలింది. పోలీసు ఎదురుగా కూర్చున్న దొంగలా ఉంది ఆమె పరిస్థితి.

రేపు విడాకుల పేపర్లు తీసుకున్నాక పూర్తిగా స్వతంత్రురాలవుతుంది. ఒంటరితనం మాత్రం తోడుంటుంది. ఒంటరితనం అనుభవించడం ఒక బాధ, చెప్పుకునేందుకు ఎవరూలేకపోవడం మరీ బాధాకరం.

సందీప్‌కి ఆరోజే క్షమాపణ చెప్పి ఉంటే, కనీసం ఈరోజు తన బాధను చెప్పుకుని కాస్త ఓదార్పు పొందేందుకు ఉండేది. సందీప్ తప్పకుండా తన బాధను అర్థం చేసుకుంటాడు. కానీ ఆ అవకాశం లేకుండా చేసుకున్నది తనే! 'నీ హద్దుల్లో నువ్వు ఉండు' శాసించింది.

మళ్ళీ 'హద్దులు చెరిపేసి నా బాధ విను' అంటే, ''ఆరోజు రమ్మన్నావు. ఈరోజు పొమ్మంటున్నావు. నువ్వు ఆడించినట్లు ఆడాలా నేను?'' అంటాడేమో!

సుప్రజ ఆలోచిస్తూనే ఉంది. సరిగ్గా అప్పుడే-''ఆంటీ! అంకుల్ పడిపోతారేమో పట్టుకో'' సందీప్ తలుపు దగ్గర నించున్నప్పుడు ఆమెతో బోలెడన్ని కబుర్లు చెప్పిన పక్కవాళ్ళ ఐదేళ్ళ పిల్ల సుప్రజను హెచ్చరించింది.

ఆ పిల్ల ఆ విషయం తనకే ఎందుకు చెప్పిందో అర్థం కాలేదు సుప్రజకి. ఆలోచించే వ్యవధి లేదు. అప్పుడే, రైలు వేగంగా మలుపు తిరుగుతుండడంతో ఒక ప్రక్కకి ఒరిగాడు.

ఒక్క ఉదుటన లేచి, సందీప్ భుజాలు పట్టుకుని సీటుమీదకి సరిగ్గా కూర్చోబెట్టే ప్రయత్నం చేసింది సుప్రజ.

ఇంతలో సందీప్ తేరుకున్నాడు. ఆమె చేతులు తన భుజాలపై ఉండడం గమనించాడతను. ఏదో అనబోయేంతలో-''నిద్రలో మీరు పడిపోబోతే పట్టుకున్నాను'' భుజాల మీంచి చేతులు తీస్తూ చెప్పింది సుప్రజ.

''థాంక్యూ!'' చెప్పాడతను. సుప్రజలో మార్పు వచ్చిందని ఆమె మాటతీరు చెప్పకనే చెప్పింది.

''నా తప్పునకు క్షమాపణ ఉండదా?''

''నిండు హృదయంతో కోరితే, క్షమించలేనంత మూర్ఖుడ్ని కాను'' అన్నాడు సందీప్.

సుప్రజ ముఖం వికసించింది.

అప్పటికి రైలు గుణదల దాటి విజయవాడ వైపు పరిగెడుతోంది.

''మీ ఆయన..'' ఆయన గురించి చెప్పమన్నట్లుగా అడిగాడు సందీప్.

సుప్రజ చెప్పిన విషయాలు విని, నిట్టూర్చాడతను.

రైలు విజయవాడ స్టేషన్‌లో ఆగింది. ప్లాట్‌ఫారం మీది లైట్లు ఆమె ముఖం మీద పడి, ఆమె బాధను స్పష్టంగా గుర్తించేలా చేసాయి.

సందీప్ ఆమె భుజం మీద రెండుసార్లు తట్టాడు ధైర్యం చెబుతూ. సుప్రజకు ఓదార్పే కావలసింది. కొండంత బలం వచ్చిందామెకు.

''జరిగినదాని నుంచి పాఠం నేర్చుకోవడమే మనం చేయగలిగిన పని'' అన్నాడు.

కాస్సేపు మళ్ళీ ఇద్దరిమధ్యా మౌనం రాజ్యమేలింది. వాళ్ళు చెప్పలేని భావాలు కళ్ళు చెప్పుకున్నాయి! మౌనానికి తెరదించుతూ ''మీ భార్య, పిల్లలు?'' ప్రశ్నించింది సుప్రజ.

క్లుప్తంగా జరిగింది చెప్పాడు సందీప్.

''భగవంతుడు మీకు అన్యాయం చేసాడు'' అదురుతున్న అతని చేతిని ఆప్యాయంగా అందుకుని అంది సుప్రజ.

ఇంతలో క్రొత్తఆశలు చిగురిస్తూ మారిన వాళ్ళ మనసులా-రైలు బయలుదేరింది.

''అరే! ట్రైన్ వెనక్కి వెళుతోందేమిటి ఆంటీ?'' అడిగింది ఇందాకటి పాప.

''లేదమ్మా! ముందుకే-హైదరాబాదుకే'' నవ్వుతూ సమాధానమిచ్చాడు సందీప్.